అంతిమ సంస్కారాలకు అవస్థలు లేకుండా..

- రూ.49 లక్షలతో అగనంపూడి శ్మశానవాటిక అభివృద్ధి
- షెల్టర్, బోర్, ఇంటర్నల్ రోడ్లు, ఇతర వసతుల కల్పనకు సన్నాహాలు


అగనంపూడి శ్మశానవాటిక

అగనంపూడి: రెండు వార్డులు.. 26 గ్రామాలు.. సుమారు 50వేల మంది నివాసముంటున్న అగనంపూడి పరిధిలోని శ్మశానవాటిక అభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో వసతుల లేమితో, వర్షాలు పడితే అంతిమ సంస్కారాలకు నానా అగచాట్లు పడాల్సిన దుస్థితి. వైఎస్సార్సీపీ ప్రభుత్వం చొరవతో జీవీఎంసీ కైలాస భూములను సంస్కరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా జాతీయ రహదారికి సమీపంలో విశాఖ ఉక్కు ఆస్పత్రి రహదారిలో ఉన్న అగనంపూడి కై లాస భూమిని రూ.49లక్షలతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. పాలకపక్షం నిధులు విడుదల చేయడంతో పాటు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శంకుస్థాపన చేశారు.

రెండు వార్డుల్లోని 14 గ్రామాల ప్రజలు ఈ శ్మశాన వాటికను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. ఇక్కడ పనిచేయని చేతి పంపు, శిథిలమైన రేకుల షెడ్ మాత్రమే ఉంది. ఆరు బయట దాతల నిర్మించిన రేకుల షెడ్లు ఉన్నాయి. తుది వీడ్కోలు పలకడానికి వచ్చిన వారు నానా అవస్థలు పడుతూ దహన సంస్కారాలు పూర్తి చేయాల్సి వచ్చేది. ఎవరైనా ఇళ్ల వద్ద మరణిస్తే నేరుగా గ్రామం నుంచి శవయాత్రగా వచ్చి కైలాసభూమిలో దహనం చేస్తారు. అదే ప్రమాదాల్లో మరణించినా, అనారోగ్యంతో ఆస్పత్రుల్లో మృతి చెందినా మృతదేహాన్ని నేరుగా శ్మశానానికే తీసుకువచ్చి ఆరుబయట నిర్మించిన షెల్టర్ల వద్ద మృతుని కడసారి చూపు కోసం ఉంచుతారు. తరువాత దహన సంస్కారాలు పూర్తి చేస్తుంటారు. అయితే, ఇక్కడ సరైన షెల్టర్ కూడా లేకపోవడంతో మృతుల బంధువులు చాలా ఇబ్బంది పడేవారు. ఆ పరిస్థితులన్నింటికీ చెక్ పెడుతూ ప్రస్తుతం శ్మశానవాటికలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం జీవీఎంసీ నిధులతో శాశ్వత భవనం, ఇంటర్నల్ రోడ్లు, బోర్‌వెల్ వేయనున్నారు. ప్రస్తుతం ఆవరణను చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఒకేసారి రెండు, మూడు శవాల దహనం చేసుకోడానికి వీలుగా ఏర్పాట్లు చేయనున్నారు. శ్మశాన వాటిక అభివృద్ధిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పందులకు నివాసంగా ఉండేది

శ్మశాన వాటికలో పందులు పడుకునేవి. పదుల సంఖ్యలో పందులు, కుక్కలు, విష సర్పాలకు ఆవరణగా ఉండేది. పనిచేయని బోర్‌వెల్‌తో ఇబ్బందులు పడేవాళ్లం. ఇక ఆ కష్టాలు ఉండవు. ఎమ్మెల్యేకు, అధికారులకు కృతజ్ఞతలు.

– విందుల వరహాలు, కొండయ్యవలస

చుట్టూ ముళ్ల తుప్పలు, పొదలు

శ్మశాన వాటికలో సదుపాయాలు కల్పించాలని ఏళ్ల నుంచి మొరపెట్టుకున్నా పట్టించుకొనే పరిస్థితి లేదు. ముళ్ల తుప్పలు, గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలతో ఆవరణం అంతా భీతిల్లేలా ఉండేది. ఆవరణలోకి వెళ్లాలంటే భయంభయంతో వెళ్లాల్సి వచ్చేది. పాలకుల చొరవతో ఆధునీకరించే దిశలో అడుగులు వేస్తుండడం సంతోషంగా ఉంది.

–బి.శ్రీనివాస్, కొండయ్యవలస

స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం

- స్పష్టం చేసిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- 864వ రోజుకు ఉక్కు రిలే నిరాహార దీక్షలు


దీక్షలో పాల్గొన్న నడుపూరు గ్రామ ప్రజలు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. లేకుంటే ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 864వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో నడుపూరు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రప్రభుత్వం దుర్మార్గంగా ఆలోచిస్తోందన్నారు. నిర్వాసితులకు ఇప్పటికీ సరైన న్యాయం చేయలేదని, ప్లాంట్‌లో ఉపాధి కోసం సుమారు 15 వేల మంది నేటికీ ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, గంగరావు, గంధం శ్రీనివాస్, ఆదినారాయణ, ఎన్.రామారావు, అయోధ్య రామ్, మంత్రి శంకర్‌నారాయణ, నడుపూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మహాసౌర పూర్వక అరుణ హోమం


సత్యసాయి మందిరంలో జరిగిన హోమంలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంలో ఆదివారం మహాసౌర పూర్వక అరుణ హోమం ఘనంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జూలై 1 నుంచి 4 వరకు 25వ పుట్టపర్తి యాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆర్థిక కష్టాలను అధిగమించి అభివృద్ధి బాటన పయనించాలని ఆకాంక్షిస్తూ ఈ హోమం నిర్వహించారు. గణపతి పూజ, సత్యసాయిబాబా అర్చన, మహాసౌరం, అరుణ మంత్ర హోమం చేశారు. పండితులు మైలవరభట్ల పవన తేజ, పి. త్రిపుర సుందర, ఆస్థాన పండితులు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హోమం జరిగింది. వి స్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్, విశ్రాంత డైరెక్టర్ ఎస్.ఎస్.రావు దంపతులు, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, పదాధికారులు ఆర్.ఎ.నాయుడు దంపతులు, విష్ణుమూర్తి దంపతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు కుటుంబాలకు సరకుల పంపిణీ


క్యాన్సర్ రోగి కుటుంబానికి సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: పేద కుటుంబాలకు పెదమదకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సాయం అందించింది. 85వ వార్డు దిబ్బపాలెంకు చెందిన క్యాన్సర్ బాధితుని కుటుంబానికి, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి కుటుంబానికి వార్డు శానిటరీ సూపర్‌వైజర్ చిత్తా నాగమణి చేతుల మీదుగా నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులతో పాటు ఆరో తరగతి చదువుతున్న బాధితుని కుమార్తెకు రూ.3 వేల విలువైన నోట్ పుస్తకాలు అందించారు. ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జామి గణేష్, సలహాదారు పట్టా రామ అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వజ్ర వారాహిదేవికి సహస్ర చామంతి పుష్పార్చన


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉక్కునగరం: వారాహి నవరాత్రి మహోత్సవాలు స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆషాడ శుద్ధ పాడ్యమి నుంచి ఆషాడ శుద్ధ దశమి వరకు నిర్వహిస్తున్న పూజల్లో భాగంగా ఆదివారం శ్రీ మహాదుర్గ అమ్మవారిని వజ్ర వారాహిదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి సహస్ర చామంతి పుష్పార్చన చేశారు. ప్రజలకు ఆరోగ్యం, పరాక్రమం కలిగేలా చూడాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైస్తవ సేవకులకు సన్మానం


జాకోబు, జోసెఫ్ సీతయ్యలను సన్మానిస్తున్న గాజువాక క్రైస్తవ నాయకులు, సేవకులు

అక్కిరెడ్డిపాలెం: కొన్ని సంవత్సరాలుగా క్రైస్తవ సంఘాలకు విశిష్ట సేవలు చేస్తూ, అభివృద్ధికి కృషి చేసిన సీనియర్ క్రైస్తవ సేవకులను గాజువాక క్రైస్తవ నాయకులు, సేవకులు ఘనంగా సన్మానించారు. 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న క్రైస్ట్ డెల్ఫియా సేవకులైన గెడ్డం జాకోబు, 87 వసంతాలు పూర్తి చేసుకున్న గాజువాక బీసీ రోడ్డు ప్రేయర్ సెల్ వ్యవస్థాపకుడు జోసెఫ్ సీతయ్యలను ఆదివారం శ్రీలానగర్ చర్చిలో ఘనంగా సన్మానించారు. గాజువాక క్రిస్టియన్ పీస్ హెల్పర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డేవిడ్ రాజు, రెవరెండ్ జి.వి.కుమార్, అరుణ్ కుమార్, రాబర్ట్ జార్జ్, సీతనీయేలు, పి.కిషోర్, స్థానిక దైవజనులు, క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు.

నంగినారపాడు పాల సొసైటీ ఎన్నిక


పాల సొసైటీ కమిటీని ఎన్నుకుంటున్న ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడు (అజనగిరి) పాల సొసైటీ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. గ్రామ మాజీ సర్పంచ్ ఇందల సీతారామయ్య, నాయకులు పి.ఎర్నిబాబు సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా ఇ.వి.రమణను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నారపిని అప్పలరాజు, బొడ్డపల్లి చినదాలినాయుడు, నారపిని జోగినాయుడు, బొడ్డపల్లి అప్పలరాజు, లంకె వెంకటరావు, పైడిరాజు, బొడ్డపల్లి గంగరాజు, లంకె అప్పల నర్సమ్మ, చట్టి దేముడు ఎన్నికయ్యారు.

గంగవరం పోర్టు కార్మికులకు సీపీఐ సంఘీభావం


సంఘీభావం తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు అండగా సీపీఐ ఉంటుందన్నారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. వేతనాలు పెంచాలని కోరితే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని, న్యాయమైన డిమాండ్ల కోసం నిరసనకు దిగితే విధుల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. కుల వృత్తి అయిన చేపల వేటను వదులుకొని, గంగవరం పోర్టు కోసం భూములను త్యాగం చేసిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు పోర్టు కార్మికులకు అండగా ఉంటామని, సంఘీభావం తెలిపారు. సమావేశంలో గాజువాక నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, పల్లేటి పోలయ్య, జి.ఆనంద్, వై.నందన్న, అప్పారి విష్ణుమూర్తి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

‘గంగవరం’ కార్మికులకు వేతన ఒప్పందం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ఉక్కునగరం: గంగవరం పోర్టు కార్మికులకు వేతన ఒప్పందం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి శాశ్వత ఉద్యోగం, వేతనాలు ఇస్తామని చెప్పారన్నారు. ఏళ్లు గడిచినా వారికి మంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. పోర్టులో పోలీసు మాజీ అధికారులను నింపడంతో అక్కడ పోలీసు పెత్తనం, బెదిరింపులు పెరుగుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యాజమాన్యం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్ మాట్లాడుతూ పోర్టులో 14 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ఇప్పటికీ బేసిక్ 3,700 రూపాయలు కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.ఎం. శ్రీనివాస్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పరశురామావతారంలో జగన్నాథుడు


పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథస్వామి

అగనంపూడి: జగన్నాథస్వామి రథోత్సవాలు జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలో కనులపండువగా జరుగుతున్నాయి. దశావతారాల్లో భాగంగా 6వ రోజు ఆదివారం జగన్నాథస్వామి పరశురామావతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గురు సంతోష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అగనంపూడి, నిర్వాసిత కాలనీలు, లంకెలపాలెం, దువ్వాడ, ఫార్మాసిటీ కాలనీలు, వడ్లపూడి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి


74వ వార్డులో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి


75వ వార్డు నెల్లిముక్కులో రక్తదానం చేస్తున్న యువకులు

పెదగంట్యాడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కోరారు. అర్క ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రామకృష్ణ జ్ఞాపకార్థం దయాల్‌నగర్‌లోని చైతన్య స్కూల్ వద్ద ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. అమ్మబ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరాన్ని వంశీరెడ్డి ప్రారంభించారు. 35 మంది దాతలు రక్తం దానం చేశారు. కార్యక్రమంలో వినోద్ బాలు, వీవీఎస్ సూరిబాబు, పెంటకోట నాగేశ్వరరావు, భీశెట్టి పవన్‌కుమార్, సారథి, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో మెగా రక్తదాన శిబిరం

పీఏఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 75వ వార్డు నెల్లిముక్కులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, కిలాని ముసలయ్య, రాంజీ, వరలక్ష్మి, అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో బేడా ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి బేడామండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తర శత నామావళి పఠించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కల్యాణం నిర్వహించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

రౌడీ షీటర్లకు సీఐ ప్రసాద్ కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ప్రసాద్

గోపాలపట్నం: రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ఎయిర్‌పోర్టు సీఐ బి.ఎం.డి. ప్రసాద్ సూచించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగరంలో నేరాల నియంత్రణపై పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పాత నేరస్తులను గుర్తించి వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. వారిలో మంచి మార్పు కోసం ప్రతీ ఆదివారం కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. నేరాలకు పాల్పడినట్లు గుర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

2న నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

- గిరి ప్రదక్షిణ సందర్భంగా మళ్లింపు

సీతమ్మధార: జూలై 2న సింహాచలం శ్రీలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం గిరిప్రదక్షిణను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు కాలినడకన తరలిరానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలపై ఏసీపీ జాన్ మనోహర్ పలు సూచనలిచ్చారు. ఆదివారం ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. సింహాచలం నుంచి బయలుదేరి హనుమంతువాక, వెంకోజీపాలెం, ఎన్ఏడీల వద్ద జాతీయ రహదారిపై కొంత మంది భక్తులు నడిచే అవకాశం ఉన్నందున 2వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 3వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు విశాఖ సిటీలో ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించాల్సిన విధులను వివరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు మళ్లిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నుంచి విశాఖ వైపు వచ్చే భారీ వాహనాలు, ప్రైవేట్ వాహనాలను లంకెలపాలెం, సబ్బవరం, పెందుర్తి మీదుగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో ఎక్కాల్సిన ప్రయాణికులు ఆనందపురం, పెందుర్తి, అనకాపల్లి వద్దకు చేరుకునేటట్లు బోర్డింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గిరిప్రదక్షిణ రద్దీ దృష్ట్యా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కె.ఎన్.వి.ఎస్.ప్రసాద్, ఎస్ఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతితో ప్రయాణం


నీటిలో పెరిగే మొక్కలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రకృతి ప్రియులు

- జీవవైవిధ్య ఉద్యానవనంలో విజ్ఞాన యాత్ర
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రకృతి ప్రేమికులు


పార్కు విశేషాలను వివరిస్తున్న నిర్వాహకుడు రామమూర్తి


సీతాకోక చిలుకగా మారుతున్న గొంగలి పురుగు

ఏయూ క్యాంపస్: ఉషోదయం వేళ ప్రకృతితో మమేకయ్యారు. వేలాది మొక్కల నడుమ నడక సాగించారు. ఈ విజ్ఞాన యాత్రకు వేదికగా నిలిచింది రాణి చంద్రమణిదేవి ఆస్పత్రి ఆవరణలో ఉన్న జీవ వైవిధ్య ఉద్యానవనం. ఆదివారం ఉదయం ఏపీ అటవీ శాఖ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ త్రూ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్, డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా ఉషోదయపు ప్రకృతి నడక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ యాత్ర సుమారు మూడు గంటల పాటు సాగింది. నగరంలోని విభిన్న రంగాల్లో స్థిరపడిన అధికారులు, విశ్రాంత ఉద్యోగులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జురాసిక్ కాలం నాటి మొక్కల విశేషాలను పార్కు నిర్వాహకులు డాక్టర్ మంథ రామమూర్తి, మంగతాయి దంపతులు వివరించారు. అనంతరం ఔషధ వనం, ఎడారి మొక్కలు, నీటిలో జీవించే మొక్కలు, అరుదైన రుద్రాక్ష చెట్టు, కృష్ణుడి వెన్న గిన్నె, సీతమ్మవారి జడ, ఆశోక వృక్షం వంటివి సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రతీ చెట్టు, మొక్క సమాచారాన్ని తెలియజేస్తూ వాటిలోని ఔషధ విలువలు, వివరాలు వివరించారు. కీటకాలను తినే మొక్కలు, అరుదైన ఆర్కిడ్‌లు, విభిన్న రకాల పామ్ ట్రీలను తిలకించి సంబరపడ్డారు. గొంగలి పురుగు సీతాకోక చిలుకగా మారే ప్రక్రియను ఇక్కడ ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు ఆశ్చర్యపోయారు. అరుదైన, అంతరించే ప్రమాదం ఉన్న వేలాది మొక్కలను పార్కులో సంరక్షిస్తూ, విద్యార్థులకు ఒక జ్ఞాన కేంద్రంగా దీనిని నిలుపుతున్నట్లు నిర్వాహకులు రామమూర్తి తెలిపారు. యువత డాల్ఫిన్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీలో సభ్యత్వం తీసుకుని పార్కు నిర్వహణ, సంరక్షణలో భాగం కావాలని కోరారు.

విస్తృత ప్రచారం అవసరం



మొక్కలంటే నాకు చాలా ఇష్టం. ఈ పార్కును తరచూ సందర్శిస్తుంటాను. ఇక్కడ ఉన్న వైవిధ్యమైన మొక్కలు మరెక్కడా చూడలేం. దీనికి విస్తృత ప్రచారం అవసరం. కృత్రిమ, అనుకూల పరిస్థితులను కల్పించి ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి మొక్కలను పెంచుతున్న నిర్వాహకులకు అభినందనలు.

– ఆర్.నీహారిక, ఉద్యోగిని

తెలుసుకుని వచ్చాను..



విశాఖపట్నంలో ఇటువంటి పార్కు ఉందని తెలియడంతో చూడాలని వచ్చాను. నేను ఉంట్లో కూడా అనేక రకాల మొక్కలు పెంచుతుంటాను. మొక్కల పెంపకం, సంరక్షించడం, వాటి ప్రత్యేకతలు ఇక్కడికి వచ్చాక తెలుసుకున్నాను.

– ఎం.సాయి ప్రణతి

అయ్యప్ప ఆలయంలో పడిపూజా మహోత్సవం



అక్కిరెడ్డిపాలెం: శ్రీలానగర్‌లోని స్వామి అయ్యప్ప దేవాలయంలో పవిత్రోత్సవ పడిపూజలను శనివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

మహిళ అదృశ్యం


శాంతమ్మ (ఫైల్)

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీవీఎంసీ 87వ వార్డు కణితి అంబేడ్కర్ కాలనీ ప్రాంతానికి చెందిన పొట్నూరు శాంతమ్మ(63) ఈ నెల 22వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి, మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలింపు చర్యలు చేపట్టారు. బంధువులను ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో శాంతమ్మ కోడలు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మహిళ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.